

ప్రతిభను వెలికితీసే వేదిక

క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే వేదిక ఎస్‌పీఎల్ అని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ -4 క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. 18లో▸



ప్రారంభమైన సమ్మక్క జాతర

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సమ్మక్క- సారలమ్మ మినీ జాతర ప్రారంభమైంది. భక్తులు డప్పువాయిద్యాల మధ్య వెళ్లి పూజలు చేశారు. 19లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.6 /13.9

ఆకాశం పాక్షికంగా మేఘవృతమై ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగుతుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ముగిసిన దరఖాస్తు గడువు

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల దరఖాస్తుల గడువు ముగిసినట్లు డీఈవో అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1,019 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారని, 115 మంది ఎడిట్ చేసుకున్నారని పేర్కొన్నారు.

భాషా పండితులకు న్యాయం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పదోన్నతులు, బదిలీల్లో భాషా పండితులకు న్యాయం చేయాలని పండిట్ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం డీఈవో అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ హామీ మేరకు భాషా పండితులకు పదోన్నతుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లాంగ్వేజ్ పండిట్ గ్రేడ్ 2, తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులు 9, 10 తరగతులకు బోధనను బహిష్కరిస్తున్నామని తెలిపారు. తమ జాబ్‌చార్టు ప్రకారం 6, 7, 8 తరగతులకు మాత్రమే పరిమితమై బోధన చేస్తామన్నారు. సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు జనవరి 31న కాగజ్‌నగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి స్పెల్ విజ్ఞాన పోటీల్లో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రతిభ చూపిన విద్యార్థులు వర్షిత్, అక్షితలను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సెల్ విజ్ఞాన పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేష్మా, పర్వీన్, భాగ్యశ్రీ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో రాణించాలి



బహుమతి అందజేస్తున్న గోవింద్‌నాయక్

నార్నూర్(జైనూర్): గ్రామీణ ప్రాంత క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో రాణించాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు భుక్యా గోవింద్‌నాయక్ అన్నారు. జైనూర్ మండలం గౌరి గ్రామంలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ స్మారక క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతగా నిలిచిన హైదర్ లెవన్ జట్టుకు రూ.30 వేల నగదు బహుమతి, మెమొంటో, ద్వితీయ స్థానంలో నిలిచిన షకీర్ జట్టుకు రూ.15వేల నగదు బహుమతి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసం కలిగిస్తాయన్నారు. ఆటలతో గ్రామీణ ప్రాంతాల్లో ఐక్యత, సోదరభావం ఏర్పడుతుందన్నారు. సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిడాం భీంరావు, పార్టీ మండల అధ్యక్షులు వహిద్ ఖాన్, రాపర్తి తిరుపతి తదితరులు ఉన్నారు.

'వేతన జీవులను వంచించిన కేంద్రం'

కాగజ్‌నగర్‌టౌన్: ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి మధ్యతరగతి వేతన జీవులకు భారీ ఊరట పేరుతో ప్రచారం చేసుకోవటం సమంజసం కాదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైద్య శాంతికుమారి, సోయం ఇందురావులు అన్నారు. పట్టణంలో వారు మాట్లాడుతూ పాత, కొత్త పన్ను విధానాలను కొనసాగిస్తూ క్రమంగా పాత పన్ను విధానాన్ని ఎత్తివేయటానికే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు బడ్జెట్ ద్వారా స్పష్టమైందన్నారు. పరోక్ష పన్నుల ద్వారా వేతనాల నుంచి ఆదాయాన్ని రాబట్టుకుంటున్న ప్రభుత్వం, వేతనాలపై భారీగా పన్ను వేయడమే అర్థరహితమని తెలిపారు.



కొత్త కలెక్టర్ ఎవరో ?

- 24 గంటలు గడవక ముందే షేక్ యాస్మిన్ బాషా బదిలీ
- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్‌కు అదనపు బాధ్యతలు
- కొత్త బాస్ నియామకంపై పరిపాలన, రాజకీయ కోణాల్లో కసరత్తు

సాక్షి, ఆసిఫాబాద్: కుమురంభీం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేసి, వనపర్తి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న షేక్ యాస్మిన్ బాషాను జిల్లాకు బదిలీ చేసినట్లుగా తొలుత ఉత్తర్వులు వెలువడ్డాయి. వెనువెంటనే మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఆమెను మళ్లీ జగిత్యాల కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు రావడంతో కుమురంభీం జిల్లాకు కొత్త కలెక్టర్‌గా ఎవరు నియమితులవుతారనేది చర్చనీయాంశమైంది. నిజాయతీగా పనిచేసే షేక్ యాస్మిన్ బాషాను జిల్లాకు రాకుండా సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పైస్థాయిలో ఒత్తిళ్లు తీసుకువచ్చారని బీఎస్పీ అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ట్విట్టర్‌లో ఆరోపించారు. అంతేకాకుండా జిల్లాల పునర్విభజన తర్వాత ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ కావడం అంటే ఓ 'శిక్ష' అనేట్లుగా ఐఏఎస్ అధికారులు భావిస్తున్నారు. అందుకే ఆసిఫాబాద్ జిల్లాకు కలెక్టర్‌గా వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. షేక్ యాస్మిన్ బాషా బదిలీ వెనుక ఇదే కారణం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రత్యక్ష ఐఏఎస్‌లకు ప్రాధాన్యం కల్పించాలా? కన్వర్డ్ ఐఏఎస్‌లైన ర్యాంకర్లకు ప్రాధాన్యం ఇవ్వాలా అనే అంశాలపై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

పరిశీలనలో పలువురు..

నిర్మల్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న హేమంత్ బొర్కడే పేరు గట్టిగానే వినిపిస్తోంది. అలాగే మరో ఐఏఎస్ కృష్ణ ఆదిత్య పేరు సైతం వినిపిస్తోంది. మరోవైపు గిరిజనులను కలుపుకుని పనిచేసే వ్యక్తికి జిల్లా బాధ్యతలను అప్పగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. అలా కాకుంటే ఇక్కడ విధులు నిర్వర్తించి ఆదిలాబాద్ కలెక్టర్‌గా బదిలీ అయిన రాహుల్‌రాజ్‌కే ఎఫ్ఏసీగా అవకాశం ఇవ్వొచ్చని తెలుస్తోంది. మొత్తంగా జిల్లాకు కలెక్టర్‌గా రావడానికి ఆసక్తి కనబరుస్తున్న వారికే ఎక్కువ అవకాశం ఉందని అంచనా ఉంది.

ప్రభుత్వం కసరత్తు..

అడవుల ఖిల్లాలో అత్యధిక జనాభా కలిగిన గిరిజన ప్రాంతాలు, ఇతర ప్రాంతాల అభివృద్ధి అంశంలో అవసరమైన మెలకువలు తెలుసుకోవడానికి జిల్లాలో యువ ఐఏఎస్‌లకు అవకాశం కల్పించారు. వీరైతే ప్రజా ప్రతినిధుల సిఫార్సులను లెక్కచేయకుండా ముక్కుసూటిగా వ్యవహరిస్తారనే భావన ఉంది. కానీ జిల్లాలో పరిపాలన ప్రజాప్రతినిధుల చేతుల్లోకి వెళ్లిపోయిందన్న వాదనలున్నాయి. కలెక్టర్ ఆధీనంలోని అన్ని విభాగాల్లోనూ, బదిలీల విషయంలో ఏకంగా జాబితాలకు జాబితాలు ఇచ్చి సిఫార్సు చేసుకోవడం ఇటీవల ఎక్కువైందనే వాదనలు వినిపించాయి. మరోవైపు పైఅధికారులతో కింది స్థాయి అధికారుల మధ్య దూరం కూడా బాగా పెరిగిపోయిందని చర్చించుకుంటున్నారు. ఆర్డీవో స్థాయి అధికారులు సైతం ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో వారికి అనుగుణంగా పనిచేయడం కూడా దూరం పెరగడానికి కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారాలన్నీ ప్రభుత్వం దృష్టికి చేరిన నేపథ్యంలోనే అటు పరిపాలన అనుభవాన్ని.. ఇటు రాజకీయ కోణం నుంచి విశ్లేషిస్తూ కలెక్టర్ నియామకాన్ని చేపట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేపడుతున్నట్లు సమాచారం.

అన్నిరంగాల్లో అభివృద్ధికి కృషి

- కలెక్టర్ బదావత్ సంతోష్
- రెండు జిల్లాల బాధ్యతలు స్వీకరణ



మంచిర్యాలఅగ్రికల్చర్/ఆసిఫాబాద్: అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధికి అధికారుల సహకారంతో కృషి చేస్తానని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం ఆయన మంచిర్యాల కలెక్టరేట్‌లో మంచిర్యాల జిల్లాతోపాటు కుమురంభీం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్(ఎఫ్ఏసీ)గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ పత్రాలపై సంతకం చేసి కుమురంభీం జిల్లా కలెక్టరేట్ ఏవోకు అందజేశారు. బదిలీల్లో భాగంగా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదిలాబాద్ జిల్లాకు వెళ్లగా, ఆయన స్థానంలో షేక్ యాస్మిన్ బాషాను నియమించిన విషయం తెలిసిందే. 24 గంటల్లోనే యాస్మిన్ బాషా జగిత్యాల జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ప్రస్తుతం బదావత్ సంతోష్‌కు కుమురంభీం జిల్లా అదనపు బాధ్యతలు అప్పగించారు.

కలెక్టర్ రాహుల్‌రాజ్ బదిలీపై సంబురాలు



జిల్లా కేంద్రంలో టపాసులు పేల్చుతున్న విద్యార్థి, యువజన, కుల సంఘాల నాయకులు

ఆసిఫాబాద్: కలెక్టర్ రాహుల్‌రాజ్ బదిలీ కావడంపై విద్యార్థి, యువజన, కుల సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సంబురాలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జిల్లాలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్‌ను బదిలీ చేయాలని పలుమార్లు ఉద్యమాలు నిర్వహించామని పేర్కొన్నారు. కొత్తగా జిల్లాకు వచ్చే కలెక్టర్ ఇప్పటివరకు జిల్లాలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. జిల్లాకు ఇన్‌చార్జి కలెక్టర్‌ను నియమించడం బాధాకరమన్నారు. జిల్లాకు పోస్టింగ్ ఇచ్చిన 24 గంటల్లోపే వేరే జిల్లాకు కేటాయించడం సరికాదని, వెంటనే రెగ్యులర్ కలెక్టర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి పటేల్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, టీఎమ్మార్పీస్ నాయకులు అంబాల రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండ శ్యాం, నాయకులు మసాదె చరణ్, సాయిరాం, జగజంపుల తిరుపతి, ప్రణయ్, తిరుపతి పాల్గొన్నారు.

'ఆపరేషన్ స్మైల్' విజయవంతం

- అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు



మాట్లాడుతున్న ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్- 09 విజయవంతమైందని అదనపు ఎస్పీ (అడ్మిన్) అచ్చేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆసిఫాబాద్ డివిజన్‌లో 21 మంది, కాగజ్‌నగర్ డివిజన్‌లో 22 మంది బాలలను రెస్క్యూ చేసినట్లు తెలిపారు. ఇందులో 42 మంది బాలురు ఉండగా, ఒకరు బాలిక ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో పోలీస్, విద్యా, రెవెన్యూ శాఖ, కార్మిక, బాలల రక్షణ విభాగం అధికారులు భాగస్వాములయ్యారన్నారు. బాలలను పనిలో పెట్టుకున్న యజమానులకు జరిమానాలు విధించామని, తల్లిదండ్రులకు పోలీసుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి అవగాహన కల్పించామని తెలిపారు. బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహించే వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల కార్మికులను గుర్తించిన వారు డయల్ 100 లేదా 1098 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమానికి ఆసిఫాబాద్ డివిజన్‌లో ఇన్‌చార్జిగా వ్యవహరించిన ఎస్సై రామకుమార్, కాగజ్‌నగర్ డివిజన్ ఇన్‌చార్జి ఎస్సై అబ్దుల్ సత్తార్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పిల్లల సంరక్షణ అధికారి మహేశ్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, జిల్లా శిశుసంక్షేమ శాఖ అధికారి సావిత్రి, జిల్లా జెండర్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, లీగల్ సర్వీస్ సభ్యులు సూర్యకళ, షీటీం ఇన్‌చార్జి ఎస్సై రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో జీవో 317పై చర్చించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కౌటాల(సిర్పూర్): అసెంబ్లీ సమావేశాల్లో జీవో 317పై చర్చించాలని కోరుతూ బుధవారం రాత్రి ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో వినతిపత్రం అందించినట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తొటం శ్యాంసుందర్ తెలిపారు. జీవో 317తో స్థానిక యువత ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారని, ఉపాధ్యాయులు కుటుంబాలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభ సమావేశాల్లో 317 జీవో బాధితుల గురించి మాట్లాడి, సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రమేశ్, అంకుస్, పృథ్వీ, ధరంసింగ్, క్రాంతి, కునాల్, కృష్ణ, ఓంప్రకాశ్, నవీన్, సాయి, దుర్గం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు



పాఠశాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే సక్కు, డీఈవో అశోక్



తరగతి గదిలో విద్యార్థులతో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- నూతన హంగులతో తేలిగూడ పాఠశాల ప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్: సర్కారు బడుల్లో సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్యనందిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా నూతనంగా హంగులతో రూపుదిద్దుకున్న ఆసిఫాబాద్ మండలంలోని తేలిగూడ ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీఈవో అశోక్‌తో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ మన ఊరు- మన బడి కార్యక్రమంలో మొదటి విడతలో జిల్లాలోని 251 పాఠశాలలు ఎంపికయ్యాయన్నారు. అభివృద్ధి పనులు కల్పించేందుకు రూ.69 కోట్లు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ప్రతీ మండలానికి రెండు స్కూళ్లను ఎంపిక చేసి ప్రహరీ, అదనపు గదుల నిర్మాణం, తాగునీరు, విద్యుత్, బెంచీల వంటి సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఎమ్మెల్యే సక్కు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యను మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతుందని తెలిపారు. డీఈవో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 18 పాఠశాలల్లో వంద శాతం పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. మిగిలిన 12చోట్ల ప్రహరీ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గురువారం వాంకిడి మండలంతోపాటు, సిర్పూర్(టి), కాగజ్‌నగర్ మండలంలోని పాఠశాలలను ప్రారంభిస్తామని తెలి పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, సర్పంచ్ పార్వతి, సెక్టోరియల్ అధికారి భరత్, ఉదయ్‌బాబు, హెచ్‌ఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ సేవలు అందుబాటులోకి తేవాలి

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సేవలు సత్వరమే అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లాగౌడ్ తోటలో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గిరీశ్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని సత్వరమే అందుబాటులోకి తీసుకురావాలని ఏజెన్సీ ప్రతినిధులకు సూచించారు. జిల్లాలో 200 మంది డయాలసిస్ రోగులకు సేవలందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణమే డయాలసిస్ సేవలు ప్రారంభించాలని కోరారు. విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాస్, ఏఈ కమలాకర్, మున్సిపల్ కౌన్సిలర్ ఎల్లేశ్, నాయకులు ఎంఏ వసీం, మహబూబ్, నగునూరి శ్రీనివాస్, సయ్యద్ హాజీ తదితరులు ఉన్నారు.

పీవోగా వరుణ్‌రెడ్డినే కొనసాగించాలి

- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్



మాట్లాడుతున్న కోట్నాక విజయ్

ఆసిఫాబాద్‌అర్బన్: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డిని నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా నియమించడంతో ఆదివాసీల అభివృద్ధికి అడ్డుకట్ట వేసినట్లు అవుతుందని, ఐటీడీఏ పీవోగా అతడినే కొనసాగించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోట్నాక విజయ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీల అభివృద్ధికి పీవో వరుణ్‌రెడ్డి కృషి చేస్తున్న సమయంలోనే బదిలీ చేయడం బాధాకరమన్నారు. కేవలం 8 నెలల వ్యవధిలోనే ఆయనను బదిలీ చేయడం ఆదివాసీలపై కుట్రగా భావిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా బదిలీని నిలిపివేయాలని కోరారు. లేని పక్షంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున రాస్తారోకోలు, ధర్నాలతో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కోవ విజయ్, నాయకులు భగవంత్‌రావ్, పెందోర్ వినేష్, ఆత్రం సాయినాథ్, మడావి రాజు ఉన్నారు.

నడిరోడ్డుపై విషపు మొక్కలు..!

- ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో డివైడర్లపై ఏపుగా పెరిగిన 'కోనోకార్పస్'
- ప్రమాదకరమని తేలడంతో ప్రజల్లో ఆందోళన
- మొక్కల తొలగింపు చర్యలు చేపట్టని అధికారులు



జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు

ఆసిఫాబాద్: జిల్లాలో పచ్చదనం.. పర్యావరణం కోసం చాలా ప్రాంతాల్లో అధికారులు కోనోకార్పస్ మొక్కలు నాటారు. పార్కులతో పాటు రోడ్ల మధ్య వీటిని పెంచుతున్నారు. అయితే ఇటీవల పరిశోధనల్లో కోనోకార్పస్ మొక్కలు పర్యావరణంతోపాటు ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని వెల్లడైంది. దీంతో చాలా దేశాల్లో వీటి పెంపకాన్ని నిషేధించారు. తెలంగాణలోనూ పలుచోట్ల వీటిని తొలగించేందుకు చర్యలు చేపడుతున్నారు. అయితే జిల్లాలో మాత్రం ఇప్పటివరకు ఈ మొక్కల తొలగింపు కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. శ్వాసకోశ ఇబ్బందులు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉండటంతో ఇప్పటికే పలు సంఘాల ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు సైతం సమర్పించారు.

పట్టణ ప్రాంతాల్లో ఏపుగా..

జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో డివైడర్లపై ఈ మొక్కలు అధికంగా నాటారు. ఫంక్షన్ హాళ్లు, పార్కుల్లో సైతం పెంచుతున్నారు. తక్కువ సమయంలో నిటారుగా, ఏపుగా పెరగడంతో ఈ రకం మొక్కలు పెంచేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల పట్టణాల్లో సైతం రోడ్ల డివైడర్ల మధ్య నా టిన కోనోకార్పస్ మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగా యి. సుందరీకరణ సంగతి అటుంచితే వీటితో జరిగే నష్టమే ఎక్కువ అని పర్యావరణ నిపుణులు అంటున్నారు. కోనోకార్పస్ చెట్లతో దుష్ప్రభావాలు అధికంగా ఉండడంతో తెలంగాణ ప్రభుత్వం కూడా నిషేధించింది. జిల్లాల్లోని అన్ని గ్రామ పంచాయతీలకు ఇప్పటికే వీటిని తొలగించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హరితహారం కార్యక్రమంలోనూ వీటిని నాటొద్దని అధికారులను ఆదేశించింది. ప్రభు త్వ ఉత్తర్వులను క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదు.

త్వరలో తొలగిస్తాం

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారితోపాటు పిల్లల పార్కులో కోనోకార్పస్ మొక్కలు పెంచాం. వీటి వల్ల మానవాళిపై దుష్ప్రభావం పడుతుందని తెలంగాణ ప్రభుత్వం నిషేధించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈమొక్కలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వీటి స్థానంలో త్వరలోనే కొత్త మొక్కలు నాటుతాం.

– రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి

పర్యావరణానికి ముప్పు

కోనోకార్పస్ పువ్వుల నుంచి వెలువడే పుప్పొడి కారణంగా అలర్జీ, శ్వాసకోశ, ఆస్తమా వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని పరిశోధనల్లో తేలింది. మానవాళితోపాటు పర్యావరణానికి కూడా ముప్పుగా పరిణమిస్తున్నాయి. వీటి వేర్లు కూడా భూమి లోతుకు పాతుకుపోయి మధ్యలో అడ్డువచ్చే కమ్యూనికేషన్ కేబుల్స్, డ్రెయినేజీల లైన్లు, భగీరథ తాగునీటి వ్యవస్థను ధ్వంసం చేస్తున్నాయి. కోనోకార్పస్ పూలపై సీతాకోక చిలుకలు కూడా వాలవు, మేకలు కూడా దీని ఆకులు తినవు. కీటకాలు, పక్షులకు కూడా ఎలాంటి ఉపయోగం లేదు. పలు రకాలుగా దుష్ప్రభావాలు చూపే కోనోకార్పస్ మొక్కలను ఇప్పటికైనా తొలగించాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

క్లుప్తంగా

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

వాంకిడి(ఆసిఫాబాద్): మనస్తాపంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై డి.సాగర్ తెలిపిన వివరాల ప్రకారం ఖిరిడి గ్రామానికి చెందిన వడ్లూరి చంద్రమ్మ (58), రామయ్య దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుర్లు సంతానం. కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా భర్త, ముగ్గురు కుమారులు మద్యానికి బానిసయ్యారు. ఇంటిని పట్టించుకోకుండా పనికి వెళ్లగా వచ్చిన డబ్బులన్నీ తాగడానికే ఖర్చు పెడుతుండేవారు. దీంతో మనస్తాపం చెందిన చంద్రమ్మ మంగళవారం రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి సోదరుడు నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

డీజే యజమానికి రూ.లక్ష జరిమానా

భీమిని(బెల్లంపల్లి): అనుమతి లేకుండా డీజే పెట్టినందుకుగానూ సదరు యజమానికి భీమిని తహసీల్దార్ లక్ష్మీరాజయ్య రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మండలంలోని చిన్నగుడిపేట గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్ గతేడాది అక్టోబర్ 6న భీమిని మండలంలోని కేస్లాపూర్‌లో దుర్గామాత నిమజ్జనంలో అనుమతి లేకుండా డీజే పెట్టడంతో పోలీసు కేసు నమోదైంది. దీంతో విచారణ అనంతరం డీజే యజమానికి రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘించిన ఒకరికి జైలు

దండేపల్లి(మంచిర్యాల): బైండోవర్ ఉల్లంఘన కేసులో ఒకరికి జైలుశిక్ష విధించినట్లు లక్సెట్టిపేట సీఐ బాబా తెలిపారు. మండలంలోని తానిమడుగుకు చెందిన మాలవత్ రమేశ్ నాటుసారా అమ్ముతూ పలుమార్లు పట్టుబడ్డాడు. దీంతో అతన్ని గతంలో దండేపల్లి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మళ్లీ నాటుసారా అమ్మి బైండోవర్ ఉల్లంఘించాడు. దండేపల్లి తహసీల్దార్ హన్మంతరావు రూ.లక్ష జరిమాన విధించారు. చెల్లించకపోవడంతో వచ్చే మార్చి వరకు అతనికి జైలు శిక్ష విధించారు. బుధవారం నిందితుడిని జైలుకు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం నామానగర్ వద్ద బుధవారం ద్వి చక్ర వాహనం అదుపు తప్పి కిందపడటంతో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీకి చెందిన అర్జున్ ప్రసాద్, తాజ్, సయ్యద్ షారుక్(23) బైక్‌పై పట్టణం నుంచి పెంచికల్‌పేట్ వైపు బయలుదేరారు. నామానగర్ మూలమలుపు వద్ద వీరి ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన షారుక్‌ను మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. గాయపడిన అర్జున్ ప్రసాద్ చికిత్స పొందుతుండగా, తాజ్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఈజ్‌గాం పోలీసులు తెలిపారు.

పొగతో ఉక్కిరిబిక్కిరి


రాత్రిపూట రోడ్డుపై కమ్ముకున్న పొగ

- డంప్‌యార్డులో చెత్తకు నిప్పు
- ఊరంతా కమ్ముకుంటున్న పొగ
- అనారోగ్యం బారిన ప్రజలు

బెల్లంపల్లి: డంప్‌యార్డులో చెత్తకు నిప్పంటిస్తుండగా దట్టంగా పొగ కమ్ముకుని పురప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అందరూ శ్వాస తీసుకోవడానికి సతమతమవుతున్నారు. రాత్రిపూట గంటల కొద్దీ పొగ కమ్ముకుని ఉంటుండగా వృద్ధులు, చిన్నారులు, శ్వాసకోశ వ్యాధిగ్రస్తులు నిద్రలేమికి గురవుతున్నారు. పొగ నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో బస్తీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ కొత్త బస్టాండ్ ఏరియా శివారు ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో కొన్నాళ్ల క్రితం డంప్‌యార్డును ఏర్పాటు చేశారు. ఆ భూమి ప్రస్తుతం స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ పరిధిలోకి వెళ్లడంతో అక్కడి నుంచి శాంతిఖని బస్తీ శివారు ప్రాంతంలో కొత్తగా డంప్‌యార్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. రెవెన్యూ అధికారులు పదెకరాల ప్రభుత్వ భూమి మంజూరు చేశారు. అయితే ఇప్పటివరకు కొత్తగా ప్రతిపాదించిన డంప్‌యార్డు పనులు ప్రారంభం కాకపోవడంతో రోజువారీగా సేకరిస్తున్న చెత్తను వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రహరీని ఆనుకుని ఉన్న ఖాళీ ప్రదేశంలో పడేస్తున్నారు. అక్కడ చెత్త కుప్పలుతెప్పలుగా పేరుకుపోయింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన చెత్తాచెదారం గుట్టలను తలపిస్తోంది. ఆయా ప్రాంతాల్లోని చెత్తకు రాత్రి పూట నిప్పంటిస్తున్నారు. చెత్త, వ్యర్థపదార్థాలకు మంట అంటుకుని దట్టంగా పొగ కమ్ముకుని ఉంటోంది. సమీపంలోని కన్నాల బస్తీ, టేకుల బస్తీ, మధునన్న నగర్, కాంట్రాక్టర్ బస్తీ, ఫుట్‌బాల్‌గ్రౌండ్‌బస్తీ, కొత్తబస్టాండ్ ఏరియా ఇందిరమ్మకాలనీ, పాత బస్టాండ్ ఏరియా, బజారు ఏరియా, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో పొగ ప్రభావం తీవ్రంగా ఉంటోంది.

డంప్‌యార్డు ఎత్తివేయాలి



దినాం పొగ కమ్ముకుని ఉంటోంది. నిద్రపోయే యాళ్లకు ఎవరో చెత్తకు నిప్పు పెడుతున్నరు. చెత్తకు నిప్పంటుకుని పొగంతా ఇంటిలో వ్యాపిస్తుండగా విపరీతమైన దగ్గు వస్తోంది. కండ్లు మండుతన్నయ్. సరిగా నిద్ర పట్టడం లేదు. డంప్‌యార్డు జనావాసాలకు చేరువలో ఉండడంతో పొగ భరించలేక పోతున్నాం. వెంటనే చెత్తకు నిప్పు చెట్టడాన్ని ఆపేసి డంప్‌యార్డును అక్కడి నుంచి ఎత్తివేయాలి.

– కన్నూరి ఓదెలు, స్థానికుడు

అప్పటి ఇబ్బందులు వద్దు



డంప్‌యార్డు నిర్వహణను మున్సిపల్ అధికారులు కొన్నినెలలుగా పట్టించుకుంటలేరు. కనీస చర్యలు తీసుకోకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. రాత్రివేళ డంప్‌యార్డు, ఇతర ప్రాంతాల్లో ఉన్న చెత్తకు నిప్పు పెడుతుండగా వచ్చే పొగ మామూలుగా ఉండడం లేదు. దట్టంగా వ్యాపించి ఊపిరి సలపకుండా చేస్తున్నది. వృద్ధులు, పిల్లలు భరించ లేకపోతున్నారు. ఆస్తమా పేషెంట్ల పరిస్థితి దారుణం. వెంటనే అధికారులు చర్యలు తీసుకుని ఇబ్బందులు లేకుండా చూడాలి.

– చింతల బాలరాజు, స్థానికుడు

పక్షం రోజుల నుంచి..

గడిచిన పక్షం రోజులుగా చెత్తకు ఇష్టారాజ్యంగా నిప్పంటిస్తున్నారు. చీకటి పడగానే నిప్పు పెడుతుండడంతో క్రమంగా పొగ వ్యాప్తి చెందుతోంది. రాత్రి 10 గంటల నుంచి సమీప ప్రాంతాలన్నీ పొగతో కమ్ముకుని ఉంటున్నాయి. మరో వైపు పొగతో గాలి కలుషితమవుతోంది. సరిగ్గా నిద్రకు ఉపక్రమించే వేళ పొగ దట్టంగా ఇళ్లలో వ్యాపిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇంటి కిటికీలు మూసి ఉన్నా లోపలికి పొగ వ్యాప్తి చెంది ఇబ్బంది పడుతున్నారు. పొగ బారి నుంచి కాపాడుకునే చర్యలు కానరాక అనేకమంది దగ్గుతో బాధ పడుతున్నారు. శ్వాస తీసుకోలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, అస్తమా వ్యాధి గ్రస్తుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంటోంది. పొగ కారణంగా గంటల కొద్దీ సమయం నిద్రపట్టకుండా గడుపుతున్నామని పలు బస్తీల ప్రజలు పేర్కొంటున్నారు. చెత్త నుంచి వెలువడుతున్న పొగతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. చెత్తకు నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకోవడం లేదు. ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకుని పొగ నుంచి కాపాడాలని పురప్రజలు కోరుతున్నారు.

ఖైదీలు క్రమశిక్షణ కలిగి ఉండాలి

- జూనియర్ సివిల్ జడ్జి అసుదుల్లా షరీఫ్

లక్సెట్టిపేట(మంచిర్యాల): అండర్ ట్రయల్ ఖైదీలు క్రమశిక్షణ కలిగి ఉండాలని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసుదుల్లా షరీఫ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్‌జైల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో నేరాలు చేసి కోర్టులు, జైళ్ల చుట్టూ తిరిగి సమయాన్ని, భవిష్యత్‌ను వృథా చేసుకోవద్దన్నారు. జైల్‌లో క్రమశిక్షణతో పాటు పరిశుభ్రతను పాటించాలని, భవిష్యత్‌లో మంచి పౌరులుగా ఉండాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలర్ స్వామి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, న్యాయవాది తాజొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి అసుదుల్లా షరీఫ్

విద్యుత్ అదనపు చార్జీలు రద్దు చేయాలి


మాట్లాడుతున్న టి.శ్రీనివాస్

పాతమంచిర్యాల: విద్యుత్ వినియోగ దారులపై విధిస్తున్న అదనపు చార్జీ(ఏసీడీ)లను రద్దు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ధరల భారంతో సతమతమవుతున్న తెలంగాణ ప్రజలపై విద్యుత్ సంస్థలు నష్టాల పేరుతో ప్రజలపై భారం మోపడం దుర్మార్గమైన చర్య అన్నారు. విద్యుత్ సంస్థల నష్టాలకు రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చాంద్ పాషా, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి అందె మంగ, ఆలిండియా కిసాన్ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు లాల్‌కుమార్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, ఐఎఫ్‌టీయూ నాయకుడు తోకల తిరుపతి, పీవోడబ్ల్యూ జిల్లా నాయకులు జ్యోతి, అరుణ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, అరుణోదయ జిల్లా కార్యదర్శి మల్లన్న, పీవైఎల్ నాయకులు సాజిద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బీసీ ఉద్యోగులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో విధులు నిర్వర్తిస్తున్న బీసీ ఉద్యోగులంతా ఐక్యంగా ఉండాలని ఆర్కే 6 గని మేనేజర్ ఈ.తిరుపతి సూచించారు. బుధవారం గనిపై సింగరేణి బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ అంతా ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. ఇందుకు గనుల వారీగా పిట్ కమిటీ వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గని వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, డెప్యూటీ మేనేజర్ మర్రి కొమురయ్య, అండర్ మేనేజర్ ప్రశాంత్, ఇంజినీర్ మహేశ్, సర్వే అధికారి వర్మ, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు వెంగళ కుమారస్వామి, గొర్రె నర్సయ్య, గోర్ల సంతోశ్, ఇప్ప భూమయ్య, సంఘం సదానందం, తోట మహేశ్, మేదారం సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీపీఏలో 82 శాతం బొగ్గు ఉత్పత్తి


వివరాలు వెల్లడిస్తున్న జీఎం దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో జనవరి నెలలో 82 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జనరల్ మేనేజర్ దేవేందర్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఏరియాలో బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. జనవరిలో ఏరియాకు 3.5లక్షల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించగా 3.04 లక్షల టన్నులతో 82 శాతం ఉత్పత్తిని నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఏరియా 28.70 లక్షల టన్నుల లక్ష్యానికి గానూ 21.31 లక్షల టన్నులతో 74 శాతంతో ముందుకెళ్తున్నామన్నారు. ఏరియాకు నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని పూర్తి చేస్తామని, అందుకు ఏరియాలోని ఉద్యోగులు, అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎస్వోటూ జీఎం కేహెచ్ఎన్ గుప్తా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, ఐఈడీ డీజీఎం పాల్గొన్నారు.

‘అదృశ్యం కేసుపై సమగ్ర విచారణ చేపట్టాలి’

కాగజ్‌నగర్‌టౌన్: తమ కుమారుడి అదృశ్యం కేసుపై సమగ్ర విచారణ చేపట్టాలని కొమ్ము దీక్షిత్ తల్లిదండ్రులు చక్రవర్తి, భాగ్యలక్ష్మి దంపతులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ బెల్లంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న తమ కుమారుడు 2022 ఫిబ్రవరి 19న ఎవరికీ చెప్పకుండా ఇంట్లోనుంచి వెళ్లి పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. 2022 ఫిబ్రవరి 20న పెద్దపల్లి జిల్లా గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గోదావరి నదిలో ఓ గుర్తుతెలియని యువకుడి శవం లభ్యంకావడంతో పోలీసుల సమాచారం మేరకు అక్టోబర్ 18న వాటిని పరిశీలించగా చొక్కా కాదని, ప్యాంటు మాత్రం తమ కుమారుడిదేనంటూ పోలీసులకు వివరించారు. అక్టోబర్ 19న వ్యక్తి తాలుకూ వెంట్రుకలు, ఎముకలను డీఎన్ఏ పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. నివేదిక ఇప్పటివరకు రాలేదన్నారు. తమ కుమారుడికి మంచిర్యాల జిల్లా ఐబీ తాండూరుకు చెందిన ఓ అమ్మాయితో పరిచయం ఉందని, ఆమె బంధువులే కొట్టి హత్య చేశారని ఆరోపిస్తున్నారు. ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే వేదిక


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి గంగుల


మేయర్ సునీల్‌రావు బ్యాటింగ్, మంత్రి కీపింగ్


తలపడుతున్న జట్లు

SAKSHI
సాక్షి SAKSHI TV
SAKSHI DIGITAL
MEDIA GROUP
SPL
SAKSHI PREMIER LEAGUE
SUDHAKAR
PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY

- విద్యార్థులు, యువత క్రీడా రంగంలో రాణించాలి
- సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ 4ను ప్రారంభించిన మంత్రి గంగుల

కరీంనగర్‌స్పోర్ట్స్: గ్రామీణ ప్రాంతాల్లోని మెరికల్లాంటి క్రీడాకారులను వెలికి తీసేందుకు ‘సాక్షి’ ప్రీమియర్ లీగ్ ఒక వేదికలాంటిదని, ‘సాక్షి’ మీడియా చేస్తున్న ప్రయత్నం అద్వితీయమని రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ‘సాక్షి’ మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో, స్టేట్ స్పాన్సర్ సుధాకర్ పీవీసీ పైప్స్ సౌజన్యంతో నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ 4 పోటీలను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతోనే యువత, చిన్నారులు సన్మార్గాల్లో నడుస్తారన్నారు. యువత విద్యలోనే కాకుండా అన్నిరంగాల్లోనూ రాణించాలన్నారు. మేయర్ సునీల్ రావు, జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ సాగర్‌రావు మాట్లాడుతూ ఇలాంటి పోటీలు గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు సువర్ణావకాశమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి, మేయర్ బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. అంతకుముందు ఉదయం జరిగిన పోటీలను జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో సుధాకర్ పైప్స్ ఏరియా మేనేజర్ షేక్ రఫీ, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, కార్పొరేటర్ ఎడ్ల అశోక్, కరీంనగర్ సాక్షి యూనిట్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్, బ్యూరో ఇన్‌చార్జి అనిల్, ఏడీవీటీ మేనేజర్ లక్ష్మీనారాయణ, సర్క్యులేషన్ మేనేజర్ మధుకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తొలి రోజు ఫలితాలు

జూనియర్స్ విభాగంలో జ్యోతిష్మతి డిప్లొమా కళాశాల, కరీంనగర్ జట్టు.. అల్ఫోర్స్ జూనియర్ కళాశాల, మంచిర్యాలపై గెలిచింది. ఎస్సార్ జూనియర్ కళాశాల, మంచిర్యాల జట్టు.. కాకతీయ జూనియర్ కళాశాల, గోదావరిఖని జట్టుపై విజయం సాధించింది. సీనియర్స్ విభాగంలో వివేకానంద డిగ్రీ కళాశాల, కరీంనగర్ జట్టు వివేకానంద ఇంజనీరింగ్ కళాశాల, కరీంనగర్‌పై విజయం సాధించింది. జూనియర్స్ బ్యాటింగ్‌లో రిషి (అల్ఫోర్స్) 23 పరుగులు, ఫిరోజ్ (జ్యోతిష్మతి) 20 పరుగులు, హుర్రేయర్ (ఎస్సార్) 19 పరుగులు చేసి అలరించారు. సీనియర్స్‌లో ఆదిల్ (వివేకానంద) 34 పరుగులు చేశారు. కాగా జూనియర్స్ విభాగంలో జ్యోతిష్మతి (కరీంనగర్), ఎస్సార్ (మంచిర్యాల) జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి.


వికెట్ తీసిన ఆనందంలో..

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు కాస్త ఊరట లభించినా ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుందని ఆశగా ఎదురు చూసిన సింగరేణి కార్మికులకు నిరాశే మిగిలింది. కేంద్ర బడ్జెట్‌పై జిల్లాలోని వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, కార్మిక, ప్రజా సంఘాల నాయకుల అభిప్రాయాలు వాటి మాటల్లోనే...

పేదలకు అనుకూలం



ఆసిఫాబాద్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలకు అనుకూలంగా ఉంది. రైతులు, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తుంది. ఏడాదికి రూ.7 లక్షల ఆదాయం ఉన్న వారికి ఇన్‌కంట్యాక్స్ కట్టాల్సిన అవసరం లేకుండా బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఎలక్ట్రానిక్, మొబైల్ ఫోన్ల ధరలు తగ్గనున్నాయి. ఆన్‌లైన్‌లో ఉద్యోగం చేసే వారికి పూర్తిగా బరువు తగ్గించారు. రైల్వే బడ్జెట్ రూ. 40 వేల కోట్లకు పెంచారు. రవాణా సౌకర్యానికి రూ. 3లక్షల కోట్లు కేటాయించారు.

– ఖాండ్రే విశాల్, బీజేపీ కుమురంభీం జిల్లా ఉపాధ్యక్షుడు

ఎరువుల రాయితీ తగ్గింపు



ఆసిఫాబాద్:ఎరువుల రాయితీ తగ్గించారు. ఉపాధి హామీకి కోత విధించారు. ఇన్సూరెన్స్‌కు ట్యాక్స్ లేకుండా చేసి దొంగదెబ్బ తీశారు. మహిళలకు ప్రోత్సాహకరంగా ఉంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు రూ.7 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయించడం హర్షనీయం.

– కొక్కిరాల విశ్వప్రసాదరావు, డీసీసీ అధ్యక్షుడు, కుమురంభీం జిల్లా

తెలంగాణపై వివక్ష



ఆసిఫాబాద్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేకంగా నిధుల కేటాయింపు లేకపోవడం బాధాకరం. తెలంగాణ నుంచి నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నా విభజన హామీల ప్రస్తావన లేకపోవడం శోచనీయం. రైతుల సంక్షేమం, వ్యవసాయంపై శీతకన్ను వేశారు. మొత్తానికి బడ్జెట్ ఖాళీ డబ్బాలో గులకరాళ్లు వేసినట్లు ఉంది.

– కాంప్రె అనిల్‌కుమార్, ఓయూ జేఏసీ కన్వీనర్

కార్మికులకు నిరాశే



శ్రీరాంపూర్: కేంద్ర బడ్జెట్ బొగ్గు గని కార్మికులకు నిరాశే మిగిల్చింది. కోల్ సెక్టార్‌లో పనిచేసే కార్మికులకు రిస్క్ సెక్టార్‌గా గుర్తించి ఐటీమాఫీ చేయాలని చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నాం. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం వచ్చే ప్రధాన పార్టీ నేతలు హామీ ఇచ్చి విస్మరిస్తున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా మాఫీ వస్తుందనుకుంటే రాలేదు.

– ఎస్కే బాజీసైదా, ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి

నిరాశే మిగిల్చింది



శ్రీరాంపూర్: ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్‌పై వచ్చే వడ్డీ రూ.2.5 లక్షలు దాటితే దానిపై ఐటీ వసూలు చేయడం వల్ల ప్రతి ఉద్యోగిపై దీని ప్రభావం పడుతుంది. గతేడాది నుంచి ఇది అమలు చేస్తున్నారు. దీని ప్రభావం దేశ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులపై పడుతోంది. ఈ సారైనా పీఎఫ్ వడ్డీపై ఐటీని మినహాయిస్తారని అనుకున్నా నిరాశే మిగిలింది.

– కూసి తిరుపతి, ఉపాధ్యాయుడు

కార్మిక వ్యతిరేకం



బెల్లంపల్లి: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో పేద, సామాన్యులకు మేలు కలిగేలా లేదు. దేశసంపదను అంబానీ, ఆదానీలకు, సంపన్న వర్గాలకు దోచి పెట్టడానికి బడ్జెట్ ప్రతిపాదించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలకు ఊతం ఇవ్వడానికి ఏమాత్రం నిధుల కేటాయింపులు లేవు. కేంద్ర బడ్జెట్ పూర్తిగా కార్మిక వ్యతిరేకమైంది. – చిప్ప నర్సయ్య, ఏఐటీయూసీ నాయకుడు , బెల్లంపల్లి

అన్నివర్గాలకు అనుకూలం



బెల్లంపల్లి: కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో అన్నివర్గాల ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చే విధంగా ఉంది. వ్యవసాయ రంగానికి రూ.20లక్షల కోట్లు కేటాయించడం వల్ల గ్రామీణ భారతం మరింత వృద్ధి చెందే అవకాశాలున్నాయి. దేశాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు బడ్జెట్‌లో సమతూకం పాటించారు. – సీహెచ్.కృష్ణదేవరాయలు, పీజీ విద్యార్థి, బోయపల్లి

ధరల నియంత్రణ ప్రస్తావనే లేదు



బెల్లంపల్లి: నిత్యావసరాల ధరలు రోజురోజుకూ చుక్కలనంటుతున్నాయి. గృహ నిర్మాణాల ముడిసరుకు ధరలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. పెరుగుతున్న ధరలతో పేదలు పోటీ పడే పరిస్థితులు కనిపించడం లేదు. ధరల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను బడ్జెట్‌లో వివరించలేదు. ఇతర అంశాల్లో పర్వాలేదు. – రేఖ, గృహిణి, మాదారం

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ సేంద్రియ ఎరువులు డైరెక్ట్ మార్కెటింగ్ చేయుటకు (ఇంటర్ to డిగ్రీ) యువతీ/యువకులు కావలెను. జీతం 10వేలు+TA,DA, వసతిసౌకర్యం. కాగజ్‌నగర్, సిర్పూర్ పరిసర ప్రాంతాల్లో. సెల్ : 7893477048, 7815852229 [M-8650]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9959617233,8466991319 [M-1190563]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. ఫోన్ : 9391036931, 9246585901. [HA-10072]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462